నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | జనవరి 14, 2025 | www.navatelangana.com


## నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ

నేరడిగొండ : మండల కేంద్రంలో సోమవారం నవతెలంగాణ నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రలోభాలకు లొంగకుండా పత్రికలు కథనాలు రాయాలన్నారు. ప్రజల ఇబ్బందులను దూరదృష్టితో ఆలోచించి ప్రజలను చైతన్యం చేయడంలో నవతెలంగాణ పత్రిక పాత్ర అమోఘమైందన్నారు. సామాజిక న్యాయంతో అందరికీ అన్ని రకాల హక్కుల కోసం వార్త కథనాలు అందించి బడుగు, బలహీన వర్గాల గొంతుకగా ఉంటుందని పేర్కొన్నారు. పోటీ ప్రపంచంలోనూ దూసుకెళ్తున్న నవతెలంగాణకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## చొప్పదండి కిషన్‌కు నంది అవార్డు

నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని ముత్యంపల్లికి చెందిన తెలంగాణ ధూంధాం కళాకారుడు చొప్పదండి కిషన్ నంది అవార్డును కైవసం చేసుకున్నాడు. భాషా సాంస్కృతిక శాఖ వారి సౌజన్యంతో ఆదర్శ కళా సేవా సంస్థ జన్నారం 25వ సిల్వర్ జూబ్లీ వార్షికోత్సవ కార్యక్రమాన్ని మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదర్శ రత్న, నంది అవార్డుల ప్రధానోత్సవం చేశారు. ముత్యంపల్లికి చెందిన కళాకారుడు చొప్పదండి కిషన్‌కు నంది అవార్డును ప్రకటించి అందించారు. సినీ రచయిత తెల్లం మురళీ మధు, నెర్నాల కిషోర్, అంతడుపుల రమాదేవి, రేలారేరేలా రవి చేతుల మీదుగా కిషన్ అవార్డును స్వీకరించారు.



# కాలం కలిసొచ్చింది..ధర లేకుంది..!

- పంట పండినా..మద్దతు ధర దక్కలేదు
- మార్కెట్‌లో జోరుగా పంట ఉత్పత్తుల అమ్మకాలు
- రైతు భరోసా..రుణమాఫీ కాక తీవ్ర అసంతృప్తి
- సంక్రాంతి వేళ..అన్నదాతల మోముల్లో మోదం..ఖేదం


**కాలం కలిసివచ్చింది.. వర్షాలు సమృద్ధిగా కురిశాయి. పంటలు బాగానే పండినా..వాటికి మార్కెట్‌లో మద్ధతు ధర పూర్తిగా లభించకపోవడంతో కొంత నిరాశ ఎదురైంది. గతం కంటే పత్తి దిగుబడి ఆశించిన స్థాయిలో రాకపోయినా.. పూర్తిగా నష్టపోయే పరిస్థితి మాత్రం కనిపించలేదు. ముఖ్యంగా మార్కెట్‌లో పత్తి, సోయా, ఇతర పంటల ఉత్పత్తులు జోరుగా అమ్మకాలు సాగడం రైతుల్లో ఆనందం వ్యక్తం కాగా.. ప్రభుత్వం రైతుభరోసా కింద పెట్టుబడి సాయం ఇవ్వకపోవడం.. రూ.2లక్షల పైన రైతులకు రుణమాఫీ ప్రక్రియ పూర్తికాకపోవడంతో వారిలో నిరుత్సాహం వ్యక్తమవుతోంది. ఆరుగాలం కష్టించి పండించిన పంటలు ఇంటికొచ్చిన శుభ సందర్భంలో రైతులు సంక్రాంతి పండగను జరుపుకొంటారు. ఈ పండగ కొంత మంది రైతుల్లో ఆనందం నింపగా.. మరికొందరిని నిరుత్సాహానికి గురిచేస్తోంది.**



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సంక్రాంతి పండగ అంటేనే ఇంటిల్లిపాది ఆనందంగా జరుపుకొనే పండగ. పిండివంటలు, కమ్మని వంటకాలు ఈ పండగ ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. తాజాగా ఈ ఏడాది వ్యవసాయం రైతుల్లో సంతోషంతో పాటు బాధను కూడా మిగిల్చింది. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది 5.60లక్షల మంది రైతులు 17.50లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. ఇందులో 10.57లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేయగా.. 3.30లక్షల్లో వరి, 1.95లక్షల ఎకరాల్లో సోయా, 90వేల ఎకరాల్లో కంది, మరో 60వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేశారు. వీటితో పాటు మొక్కజొన్న, జొన్న, మిర్చి, ఇతర కూరగాయల పంటలు సాగు చేశారు. ఈ ఏడాది పత్తి పంట ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోయినా పర్వాలేదనే రీతిలో దిగుబడి రావడం కాస్త ఊరట కలిగించింది. వర్షపాతం సైతం ఈ ఏడాది సాధారణం కంటే అధికంగా నమోదైంది. ప్రస్తుతం సీసీఐ 58వేల మంది రైతుల నుంచి 15.83లక్షల క్వింటాల్‌లు పత్తి కొనుగోలు చేయగా.. ప్రయివేటు వ్యాపారులు సుమారు 10వేల మంది రైతుల నుంచి 1.56లక్షల క్వింటాల్‌లు కొనుగోలు చేశారు.

**మద్ధతు దక్కక నిరాశ..!**



రైతులు పంటలు పండించటం ఓ ఎత్తైతే.. మార్కెట్‌లో మద్ధతు ధర దక్కకపోవడం రైతులను నిరాశకు గురిచేసింది. ప్రభుత్వం పత్తికి క్వింటాల్‌కు మద్ధతు ధర రూ.7521గా నిర్ణయించగా.. ప్రయివేటు వ్యాపారులు తొలి నుంచి రూ.6900వరకు నిర్ణయించారు. మరోపక్క తేమ పేరిట ధరలో భారీగా కోత విధించగా.. ఒక్కో రైతుకు క్వింటాల్‌కు కేవలం రూ.6500వరకు మాత్రమే దక్కింది. ఇక సీసీఐకి విక్రయించిన రైతులు కొంత ప్రయోజనం పొందినా.. తేమ పేరిట కోత విధించడం.. 12శాతం తేమ దాటితే అసలు కొనుగోలు చేయకపోవడంతో అనేక మంది రైతులు ఇబ్బందులకు గురయ్యారు.

ప్రయివేటుకు విక్రయించిన రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. దీంతో ప్రభుత్వం మద్ధతు ధర కూడా రైతులు పొందలేకపోవడంతో నష్టాన్ని చవిచూడాల్సి వచ్చింది. మరోపక్క పెట్టుబడి ఖర్చులు అధికం కావడం.. ఆశించిన దిగుబడి రాకపోవడం.. మార్కెట్‌లో కనీస మద్ధతు ధర కూడా పొందలేకపోవడంతో ఇబ్బందులకు గురికావాల్సి వచ్చింది.

**రైతుభరోసా..రుణమాఫీ కాక ఇబ్బందులు..!**

ప్రభుత్వం ఖరీఫ్‌కు సంబంధించి రైతులకు వేయాల్సిన రైతు భరోసా పథకం డబ్బులను ఖాతాల్లో జమ చేయలేదు. రబీ సీజన్‌కు కూడా పెట్టుబడి సాయం దక్కలేదు. దీంతో రైతులు పంటల సాగుకు ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం ఈ పథకంపై మంత్రివర్గ ఉప సంఘం నియమించడం.. క్షేత్రస్థాయిలో అభిప్రాయ సేకరణ చేపట్టడం తదితర కారణాలతో జాప్యం జరిగింది. తాజాగా ప్రభుత్వం రైతు భరోసా కింద ఆర్థిక సాయాన్ని ఎకరానికి రూ.12వేల చొప్పున జమ చేయాలని నిర్ణయించింది.

సాగు భూములకు ఈ నెల 26న రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు సిద్ధమవుతోంది. మరోపక్క ప్రభుత్వం రైతు రుణమాఫీలో భాగంగా ఇప్పటి వరకు ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 55వేల మంది రైతులకు రూ.600 కోట్లు మాఫీ చేసింది. కానీ రూ.2లక్షలకు పైగా ఉన్న రైతులకు మాఫీ చేయకపోవడంతో వారంతా నిరాశకు గురవుతున్నారు. ప్రభుత్వం ఇటీవల ఈ సమస్యపై స్పందించింది. కచ్చితంగా రూ.2లక్షలకు పైగా ఉన్న రైతుల రుణాలను సైతం మాఫీ చేస్తామని భరోసా ఇవ్వడం కొంత ఊరటనిస్తోంది. మరోపక్క వివిధ రకాల సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతులు సైతం కార్యాలయాల వెంట తిరుగుతున్నారు. ఇలాంటి రైతులు ఒక్కో జిల్లాలో సుమారు 10వేల మందికి పైగానే ఉన్నారు. ఈ సమస్యను సైతం పరిష్కరించి వారిలో ఆనందం నింపాల్సిన అవసరం ఉంది.

## మండల అభివృద్ధికి కృషి చేయాలి

- మంత్రి సీతక్కకు స్వాగతం పలికిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-నార్నూర్

మండల అభివృద్ధికి కృషి చేయాలని కాంగ్రెస్ మండల నాయకులు, మాజీ సర్పంచ్ గజానంద్ నాయక్ మంత్రి సీతక్కను కోరారు. సోమవారం కెరమెరి మండలంలోని ఆదివాసీ ఆరాధ్య దైవం జంగుబాయి పుణ్యక్షేత్ర దర్శనానికి వచ్చిన మంత్రి సీతక్కకు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. మంత్రి అభివృద్ధికి సానుకూలంగా స్పందించినట్లు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మారుతి, మాజీ జెడ్పిటిసి బ్రీజులాల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దేవ్‌రావ్ లోఖండే, సర్పంచుల సంఘం మాజీ మండల అధ్యక్షుడు రూప్‌దేవ్, ఏఎంసి డైరెక్టర్ కైలాస్, ప్యాక్స్ డైరెక్టర్ దుర్గే కాంతారావ్, రాథోడ్ దత్తరాం, మడావి రూప్‌దేవ్, సత్తార్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షేక్ నసీర్, దాదేఅల్లి పాల్గొన్నారు.

## గజిటెడ్ హెడ్మాస్టర్స్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతుగా పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో తెలంగాణ గజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. అనంతరం అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యేకు పలు సమస్యల గురించి తెలియజేశారు. సంఘ భవనంతో పాటు పెండింగ్ డీఏ, రిటైర్మెంట్ బెన్ఫిట్స్ త్వరగా అందించేలా చూడాలని విన్నవించారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్‌సింగ్ తిలవాత్ తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం శశికళ, కమిటీ సభ్యులు నర్సయ్య, రాజశేఖర్, నీల, పద్మజ పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో గొర్రె మృతి

నవతెలంగాణ-బోథ్



మండలంలోని ధన్నూర్(బి) గ్రామానికి చెందిన షేక్ పెద్ద మోహినుద్దీన్‌కు చెందిన గొర్రె కుక్కల దాడిలో మృతి చెందింది. సోమవారం తన ఇంటి సమీపంలో ఒకేసారి దాడి చేయడంతో మృతి చెందిందని అన్నారు. గొర్రె విలువ సుమారుగా రూ.12వేల వరకు ఉంటుందని తెలిపారు. సంబంధిత అధికారులు న్యాయం చేయాలని బాధితుడు వేడుకుంటున్నాడు. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని, ఎక్కడపడితే అక్కడ స్వైర విహారం చేస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గొర్రెపై దాడి చేసిన కుక్కలు చిన్న పిల్లలపై కూడా దాడి చేయొచ్చని స్థానికులు భయపడుతున్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా అధికారులు కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## విశ్రాంత ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే పాయల్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం క్యాలెండర్‌తో పాటు డైరీని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు ఉన్నారు.

## చిన్నారులకు పతంగుల పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఏకదంత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం చించెరవాడలో చిన్నారులకు పతంగులను పంపిణీ చేశారు. అంతకు ముందు ఉదయం భోగి మంటలు వేశారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం బోగి మంటలు వేసి చెడుపోయి మంచి కలగాలని ప్రార్థించారు. సొసైటీ అధ్యక్షుడు అరుణ్ మాట్లాడుతూ శ్రీభారతీయ గణేష్ మండల్ స్థాపించి 40 సంవత్సరాలు పూర్తి అయినందున సొసైటీని ఏర్పాటు చేశామన్నారు. సొసైటీ ద్వారా సేవా కార్యక్రమాలను ముమ్మరం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి జోగు హరీష్, కోశాధికారి చందు, సలహాదారులు రాజ్‌కుమార్, ముఖ్య సభ్యులు జోగు శివ, చుక్కలవార్ మయూ, లక్ష్మీనారాయణ, గందేవార్ శివ పాల్గొన్నారు.

# ప్రకృతే ఆదివాసుల ఆరాధ్య దైవం

- రాష్ట్ర మంత్రి సీతక్క
- సాంప్రదాయ వస్త్రాలు ధరించి మొక్కుల చెల్లింపు

నవతెలంగాణ-కెరమెరి

ప్రకృతే ఆదివాసులకు ఆరాధ్య దైవం అని మంత్రి సీతక్క అన్నారు. సోమవారం మండలంలోని మహారాజ్‌గూడ సహ్యాద్రి పర్వతాల్లో కొలువు దీరిన జంగు బాయి పుణ్య క్షేత్రాన్ని కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎమ్మెల్సీ దండే విటల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎంపీ సోయం బాబురావు, జీసీసి చైర్మన్ తిరుపతి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు , ఐటీడీఏ పీవో కుష్బూ గుప్త, అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి దర్శించుకున్నారు. గిరిజన సంప్రదాయ పద్ధతి దుస్తులు ధరించిన సీతక్క, కోవ లక్ష్మి ఆత్రం సుగుణ అందరినీ ఆకట్టుకున్నారు. సాంస్కృతి, సాంప్రదాయల పద్ధతిలో అమ్మవారి గుహలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆదివాసీ సమాజంలో ప్రకృతి రూపంలో దేవుండ్లను ఆరాధిస్తమని తెలిపారు. ప్రతి వర్గం ఒక్కో పద్ధతిలో పూజ విధానం ఉంటుందన్నారు. ప్రతి ఒక్క వర్గానికి చెందిన ఆచారాలను గౌరవించాలని పేర్కొన్నారు. జాతి ఆచారాలను చెప్పుకోవడానికి సిగ్గు పడాల్సిన అవసరం లేదన్నారు. ఆదివాసులు ఆర్థికంగా



వెనుకబడి అడవులలో జీవిస్తున్నప్పటికీ అది ప్రత్యేక జీవన విధానమని తెలిపారు. ఈ ప్రాంతంలో గోండ్వన, కోయ రాజ్యాలుగా ఏలిన చరిత్ర ఆదివాసులకు ఉందన్నారు. ఆచారా మూలాలను భావితరాలు ఆచరించేలా ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి అనే అంశంతో నాగరికులుగా ముద్ర వేసి మన ఆచారాలు, సాంప్రదాయాలు తీసివేసి మాదే గొప్పది అని ప్రచారం జరుగుతోందన్నారు. దీపం రూపంలో ఉన్న అమ్మను దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. రూ.50లక్షలతో జంగు బాయి దివ్య క్షేత్రంలో మౌళిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. క్షేత్రానికి సంబంధించిన భూములకు పట్టాలు ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ ఆదివాసుల ఆరాధ్య దైవం జంగుబాయిని మొదటిసారిగా దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ జాతరలో అందరూ కలిసి సంస్కృతి సంప్రదాయాలను పాటించడంతో పాటు భావితరాలకు అందించాలని తెలిపారు. ప్రకృతిని పూజించడం ఈ ప్రాంతం నుండి నేర్చుకున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని, రోడ్ల అభివృద్ధికి అటవీశాఖ అధికారులతో సమన్వయం చేసుకొని వాటి నిర్మాణానికి చర్యలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేష్, డిసిసి ప్రెసిడెంట్ కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యామ్‌నాయక్, ఎంపిడిఓ అంజత్ పాషా, తహసీల్దార్ దత్తు ప్రసాద్‌రావు, నాయకులు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



**ఆదివాసీ సాంప్రదాయ చీర కట్టుతో సీతక్క, ఎమ్మెల్యే కోవ లక్ష్మీ**

జిల్లా పర్యటనలో భాగంగా మండలంలోని జంగుబాయి పుణ్యక్షేత్రంలో కొనసాగుతున్న పూజలకు హాజరైన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదివాసీ గిరిజన సాంప్రదాయ చీర కట్టుతో ఆకట్టుకున్నారు. ఎప్పుడూ చీరకట్టులో కనిపించే సీతక్క, సోమవారం జంగుబాయి ఆలయం వద్ద ఆదివాసీల గ్రీన్ కలర్ చీర కట్టుకుని సాంప్రదాయాన్ని మరోసారి చాటారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కుడా మంత్రితో పాటు చీర కట్టుకుని సాంప్రదాయం గుర్తు చేశారు.

## ఘన్‌పూర్‌లో హైమాస్ట్ లైట్లు ప్రారంభం

నవతెలంగాణ-బోథ్

మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో సోమవారం హైమాస్ట్ లైట్లను గ్రామస్తులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చొరవతో హైమాస్ట్ లైట్లు ఏర్పాటయ్యాయని తెలిపారు. దీనికి గ్రామస్తులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.



## సమాజానికి ఉపాధ్యాయులే మార్గనిర్దేశకులు

### : ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

సమాజానికి ఉపాధ్యాయులే మార్గనిర్దేశకులు అని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. క్యాంప్ ఆఫీసులో స్టేట్ టీచర్స్ యూనియన్ క్యాలెండర్లను సోమవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. నేటి బాలురే రేపటి నవభారత జాతి నిర్మాతలు అని అన్నారు. వీరిని తయారు చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమన్నారు. అనంతరం ఎన్నో సంవత్సరాల నుండి నిర్మల్ జిల్లా ప్రజల చిరకాల కోరికైన రైల్వే లైన్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను ఎస్టీయు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యస్.భూమన్న యాదవ్, జె.లక్ష్మణ్, రాష్ట్ర నాయకులు జుట్టు గజేందర్, గంగాధర్, ఇర్ఫాన్ శేఖ్, యం. శ్రీనివాస్, బి.వెంకటేశ్వర్‌రావు, లక్ష్మి నారాయణ, ఖాలిద్ అహ్మద్, దిగంబర్, నర్సయ్య పాల్గొన్నారు.

## మాజీ ఎంపీతో కంది ఆత్మీయ భేటీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మాజీ ఎంపీ సోయం బాపురావుతో కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి ఆత్మీయంగా భేటి అయ్యారు. బీజేపీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత మొదటి సారిగా సోయం బాపురావును ఆయన నివాసానికి కాంగ్రెస్ శ్రేణులతో వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పార్టీలోకి గ్రాండ్ వెల్‌కం చెప్పారు. పలు అంశాలపై ఇరువురు నాయకులు చర్చించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లోక ప్రవీణ్‌రెడ్డి, దేరా కృష్ణారెడ్డి, నరేశ్‌రెడ్డి, మైనార్టీ నాయకులు షకిల్, రఫీక్ ఉన్నారు.

## ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి

**నవతెలంగాణ-భైంసా**

జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా భైంసా పట్టణంలోని గాంధీ గంజ్ మార్కెట్ యార్డ్ వద్ద వాహన డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టణ ఎస్సై మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిబంధనల ప్రకారం నడుచుకొని ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు, వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. డ్రైవర్లు జాగ్రత్తగా ఉంటే అందరూ గమ్యస్థానానికి సుఖంగా చేరుకోగలుగుతారన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై దేవరావ్, సిబ్బంది పాల్గొన్నారు.



## నిత్యావసర సరుకులు అందజేత

**నవతెలంగాణ-బేల**

మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన నిరుపేద కుటుంబం సయ్యద్ ఉమర్ షుగర్ వ్యాధితో గత ఆగస్టు నెలలో మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్‌రెడ్డి స్పందించి సోమవారం నిరుపేద బాధిత కుటుంబానికి సయ్యద్ జబీనాకు రూ.5వేల విలువగల నిత్యావసర సరుకులను తనవంతు సాయంగా అందజేశారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ బేల మండలాధ్యక్షుడు గోడే అవినాష్, నాయకులు కన్య రాజు, వాంఖడే నాయన్, గజు, మైనార్టీ నాయకులు మహబూబ్ ఖాన్, సులేమాన్ పాల్గొన్నారు.



# సంక్రాంతి వచ్చింది.. సరదాలు తెచ్చింది

- పల్లె, పట్టణామంత తలపిస్తోన్న పండుగ వాతావరణం
- ఒకవైపు పిండి వంటకాలు.. మరోవైపు గాలిపటాలు
- చిన్నాపెద్ద తేడా లేకుండా సంబరాలు


ఆశీర్వాదాలు తీసుకుంటున్న చిన్నారులు

**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

సంక్రాంతి వచ్చిందే తుమ్మెద.. సరదాలు తెచ్చిందే తుమ్మెద సంక్రాంతి పండుగ వస్తే చాలు మోగిపోతుంది. సరదాల సంక్రాంతి పండుగ రానే వచ్చింది. సంబురాలను తెచ్చింది. ఇప్పటికే చాలా చోట్ల మినీ సంక్రాంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. సూర్యుడు ధనస్సు నుంచి మకరంలోకి ప్రవేశించనప్పుడే మకర సంక్రాంతి పండుగను జరుపుకుంటారు. ఇదే సమయంలో పంట చేతికొచ్చిన అన్నదాత కళ్లల్లో ఆనందం తెచ్చే సంబరమే సంక్రాంతి. ఈ పండుగకు ఒక రోజు ముందుగానే భోగి పండుగ వస్తుంది. ఈ పండుగ వేళ తెల్లవారుజామునుంచే పల్లెటూళ్లలో భగభగ మండే భోగి మంటలను వేస్తారు. ఇందులో పాత చెక్కతో పాటు ఇంట్లో ఉండే పాత సామాగ్రి అంతా వేస్తారు. భోగి మంటల చుట్టూ చేరి ఆటలు, పాటల కార్యక్రమాలను నిర్వహిస్తారు. అనంతరం భోగి మంటలపై పాత్రలను ఉంచి అందులో నీటిని వేడి చేసి, దాంతో స్నానం చేస్తారు. అలాగే మూడవ రోజు కనుమ పండుగ నిర్వహిస్తారు.

**భోగి పండ్లు పోస్తూ ఆశీర్వదిస్తూ..**

భోగి పండుగ రోజున ఉదయమంతా భోగి మంటలతో సందడిగా గడిపితే.. సాయంత్రం వేళలో చిన్నారుల తలపై భోగి పండ్లు పోసే కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ పిల్లలపై తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారు చిన్నారుల తలపై భోగి పండ్లను పోసి ఆశీస్సులు అందజేశారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్ పట్టణంలోని వాల్మీకి నగర్‌లోని సాదుల అశోక్ నివాసంలో భోగి పండ్ల పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. చుట్టూ పక్కల వారు వచ్చి సందడి చేశారు. తమ చిన్నారుల తల మీద భోగి పండ్లు పోసి తల్లిదండ్రులు, ఇరుగుపొరుగు వాళ్ళు వారిని ఆశీర్వదించారు. రేగు పండ్లతో పాటు అందులో బంతి, చేమంతి పూల రెక్కలు, నాణేలు వేసి హారతులిచ్చారు.


ముగ్గు వేస్తున్న చిన్నారి

**గాలిపటాలతో సందడి సందడిగా...**

సంక్రాంతి పండుగ వచ్చిందంటే చిన్నారుల నుంచి యువకుల వరకు అందరికీ గుర్తుకు వచ్చేది పతంగులు ఎగురవేయడం. పతంగులు ఎగురవేసే చిన్నారులు, యువకులు ప్రతి ఒక్కరూ పతంగులూ కొనుగోలు చేస్తుండటంతో జిల్లా వ్యాప్తంగా సందడి నెలకొంది. పతంగుల దుకాణాల ముందు పిల్లలు యువకులు చేరుకొని పతంగులు, మాంజలు కొంటున్నారు. పతంగులు ఎగురవేసేందుకు మాంజా కాకుండా సాధారణ దారాన్నే వినియోగించాలని పోలీసులు సూచిస్తున్నారు. కాగా, మార్కెట్‌లో అక్కడక్కడా నిషేధిత చైనా మాంజపై పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. గాలిపటాలు విభిన్న ఆకృతులు రంగుల్లో.. గరుడ పక్షి, విమానం, చేప, పులి ఇలా అనేక ఆకృతులు, చిత్రాలతో ఉన్న అనేక రకాల పతంగులను అమ్మకానికి పెట్టారు. దీంతో చిన్నారులు ఆసక్తిగా తిలకిస్తూ కొనుగోలు చేస్తున్నారు. ఇండ్లపైనే పాటల నడుమ ఈలలు కేకలు వేస్తూ పతంగులతో సందడి చేశారు.

**ఘుమఘుమలాడుతున్న పిండి వంటకాలు..**

సంక్రాంతి పండుగ అంటే రంగురంగుల ముగ్గులతో పాటు ముఖ్యంగా గుర్తొచ్చేది పిండి వంటకాలు. నోరూరించే పిండి వంటల కోసం చిన్నాపెద్ద అందరూ ఎదురుచూస్తుంటారు. పండుగకు వారం ముందు నుంచే ఇంటింటా పిండి వంటలు చేస్తూ మహిళలు, యువతులు బిజీబిజీ అయ్యారు. అరిసెలు, గారెలు, సకినాలు, నువ్వుల లడ్డూలు, బూందీ లడ్డు, గవ్వలు, సున్నుండలు, చక్రాలు, కారపుపూస ఇలా పిండి వంటల తయారీతో వీధులు ఘుమఘుమలాడుతున్నాయి. ఇదిలా ఉండగా పిండివంటకాలు చేయడానికి పిండి కోసం గిర్నిల చుట్టూ తిరుగుతున్నారు. పలు గిర్నిలలో దారి పొడవునా క్యూలైన్ ఉంటోంది.


పిండి పట్టించేందుకు గిర్ని వద్ద బారులు తీరిన ప్రజలు


పతంగులతో యువకులు


చకినాలు చుడుతున్న మహిళలు


పండుగ సందర్భంగా ఆనందం వ్యక్తం చేస్తున్న చిన్నారులు

## పత్తి కొనుగోళ్లలో నిలువు దోపిడీ



**నవతెలంగాణ-బేల**

మండల కేంద్రంలోని జిన్నింగ్ మిల్లులో సీసీఐ కొనుగోళ్లలో అధికారులు ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారని, మండల బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. పత్తిలో నాణ్యత లేదనే సాకుతో, కౌడి పేరుతో చప్రాల గ్రామానికి చెందిన రైతు నుంచి 21 క్వింటాళ్ల పత్తికి, రెండు క్వింటాళ్ల ఇరవై కిలోల పత్తిని శనివారం సీసీఐ అధికారులు కోత విధించారని తెలుసుకున్న మండల బీఆర్ఎస్ నాయకులు ఆశాపుర జిన్నింగ్‌కు వెళ్లి సీసీఐ అధికారులతో మాట్లాడారు. పత్తి కొనుగోళ్లలో కోతలు విధించి, పత్తి కొనుగోలు చేయడం సరికాదని, నాయకులు సీసీఐ అధికారులను హెచ్చరించారు. రైతులు వారు పండించిన పంటలకు సరైన ధరలు లేక అనేక ఇబ్బందుల్లో ఉన్నారని అన్నారు. అలాంటి రైతులను సీసీఐ అధికారులు వారికి నచ్చిన విధంగా కోతలు విధిస్తూ, కొనుగోళ్లు చేయడం సరికాదని, సీసీఐ అధికారులు తీరును మార్చుకోవాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి మరిన్ని ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు. దీంతో సీసీఐ అధికారులు దిగి వచ్చి, మరోసారి ఎలాంటి కోతలు విధించకుండా రైతుల వద్ద నుంచి పత్తి కొనుగోలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు గంభీర్ ఠాక్రే, జక్కుల మధుకర్, కళ్లెం ప్రమోద్‌రెడ్డి, సతీష్ పవార్, మస్కే తేజరావ్, కిషన్ వైద్య, మంగేష్ ఠాక్రే, పారట్‌కర్ బాల్‌చందర్, విపిన్ ఖోడే, గోడే విశాల్, రైతులు పాల్గొన్నారు.

## మరిన్ని సేవలు అందించేందుకు కృషి



**నవతెలంగాణ-బోథ్**

సొసైటి ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు అందించేందుకు కృషి చేస్తానని తుల సుభాష్ వెల్ఫేర్ సొసైటీ చైర్మెన్ తుల అరుణ్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని గొల్లాపూర్, పార్డి(కె), మామిడిగూడ, గ్రామంలో ఎస్సై ప్రవీణ్ చేతుల మీదుగా వృద్ధులకు దుప్పట్లు, విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటి చైర్మెన్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో సొసైటీ సేవలు అభినందనీయమని ఎస్సై అన్నారు. రాబోవు రోజుల్లో సొసైటీ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై రాజశేఖర్‌రెడ్డి, గ్రామాల పటేళ్ల పాల్గొన్నారు.

## కొట్టుకుపోయిన రోడ్డుకు తాత్కాలిక మరమ్మత్తులు



**నవతెలంగాణ-సిరికొండ**

వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలతో రోడ్డు కోతకు గురి కావడంతో వాహనదారులకు రాకపోకలకు ఇబ్బంది కరంగా మారింది. దీంతో సమస్యను స్థానిక బీఆర్ఎస్ నాయకులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం స్థానిక నాయకులకు సమాచారం అందజేసి, రోడ్డుకు తాత్కాలిక మరమ్మత్తులు చేశారు. గ్రావెలింగ్ వేసి మరమ్మత్తులు చేపట్టారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పెంటన్న, ఇక్బాల్, రొహిదాస్, కోసేరావ్ పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతోనే మానసిక ప్రశాంతత



**నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్**

ఆధ్యాత్మికతోనే మానసిక ప్రశాంతత ఉంటుందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. సోమవారం మండలంలోని పిప్పల్‌ధరి గ్రామంలో కొనసాగుతున్న బాజీరావు బాబా సప్తహ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికం వైపు అడుగులు వేయాలని సూచించారు. కొన్ని సందర్భాల్లో భక్తి కార్యక్రమాలను రాజకీయం చేయడం బాధ కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు చందాల రాజన్న, గండ్రత్ రమేష్, సేవ్వా జగదీష్, బట్టు సతీష్, రమణ, అప్కామ్ గంగయ్య, ఉగ్గే విఠల్ పాల్గొన్నారు.

## గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి

**నవతెలంగాణ-నార్నూర్**

ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోనే గిరిజన విశ్వవిద్యాలయం యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రతి జిల్లాలో ఏదో ఒక యూనివర్సిటీ ఉందని తెలిపారు. కాని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా విషయానికొస్తే ఒక్క యూనివర్సిటీ కూడా లేదని ఆదిలాబాద్ అంటేనే ఆదివాసీ గిరిజన జిల్లాగా పేరు ఉందని పేర్కొన్నారు. విద్యా పరంగా అభివృద్ధి చెందాలంటే ఖచ్చితంగా గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటు చేసి, కుమురంభీం యూనివర్సిటీగా నామకరణం చేయాలని కోరారు.

## ఆధార్ కేంద్రం ఏర్పాటు



**నవతెలంగాణ-ఖానాపూర్**

ఖానాపూర్ పట్టణంలోని సబ్ పోస్ట్ ఆఫీస్ కార్యాలయంలో సోమవారం ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు నిర్మల్ సబ్ డివిజన్ తపాలాధికారి సందీప్ తెలిపారు. ప్రజా సేవలో భాగంగా తపాలా కార్యాలయంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆధార్ కార్డులో మొబైల్ నెంబర్, అడ్రస్ సవరణ, ఫింగర్ ప్రింట్ అప్‌డేట్ చేసుకోవచ్చని అన్నారు. అంతేకాకుండా తపాలా కార్యాలయంలో ప్రజల కోసం పొదుపు పథకాలు, తపాల జీవితబీమా, రికరింగ్ డిపాజిట్, వృద్ధులకు సీనియర్ సిటిజన్ పథకం, మహిళలకు ప్రత్యేకంగా మహిళ సంయోజన పథకం, ఆడ పిల్లల కోసం సుకన్య సమృద్ధి పథకం లాంటి పొదుపు పథకాలను తపాలా శాఖ ప్రవేశపెట్టిందని తెలిపారు. ప్రజల కోసం తపాల శాఖ సేవ భావంతో ప్రవేశపెట్టిన పథకాలలో ప్రజలు భాగస్వామ్యం కావాలని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాల కోసం మీ దగ్గరలో ఉన్న పోస్టల్ సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ తపాల శాఖ సబ్ పోస్ట్ మాస్టర్ పి.నవీన్, పోస్టల్ అసిస్టెంట్ శ్రీకాంత్, పోస్ట్ మ్యాన్ రంజిత్ కుమార్, సిబ్బంది సయ్యద్ సద్దాం, సాదాబ్, ఎం.నర్సయ్య, రణదీర్, బి.నాగరాజు పాల్గొన్నారు.

## సంఘ భవనానికి నిధులు మంజూరు చేయాలి



**నవతెలంగాణ-నిర్మల్‌టౌన్**

సారంగాపూర్ మండలం బీరవెల్లి ఉద్యోగ సంఘ భవనానికి నిధులు మంజూరు చేయించాలని సోమవారం జిల్లా కేంద్రంలోని డీసీసీ క్యాంపు కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావును మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా బీరవెల్లి ఉద్యోగ సంఘం నాయకులు శ్రీహరిరావుకు పూల బొకే ఇచ్చి శాలువాతో సన్మానించారు. వినతిపత్రం అందజేసిన వారిలో అధ్యక్షులు గంగాధర్, సంఘ నాయకులు గంగారెడ్డి, లక్కడి శ్రీనివాస్‌రెడ్డి, లక్కడి శ్రీదేవి, భాస్కర్‌రెడ్డి, గణేష్, నర్సయ్య లతీఫ్, శ్యామ్ కుమార్ ఉన్నారు.

# తెగిన గాలిపటంలా రైతుల జీవితాలు

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గాలిపటాలతో వినూత్న నిరసన
- రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపి
- దిష్టిబొమ్మ దహనానికి యత్నం, స్వల్ప తోపులాట



**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో రైతులు, సామాన్య ప్రజానీకం పరిస్థితి తెగిన గాలిపటంలా మారిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న అన్నారు. రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. స్థానిక ఆర్ అండ్ బీ విశ్రాంతి భవనం నుంచి ర్యాలీగా బయలుదేరిన నాయకులు బస్ స్టాండ్ ఎదుట పాత జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ హోరెత్తించారు. గాలి పటాలపై డిమాండ్లను రాసి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ధర్నాలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రాలను దహనం చేసేందుకు నాయకులు యత్నించగా, వారిని పోలీసులు నిలువరించడం ఉద్రిక్తతకు దారి తీసింది. జోగు రామన్నను అక్కడి నుంచి పంపించేందుకు పోలీసులు ప్రయత్నించడంతో ఇరువురి మధ్య కొంత తోపులాట చోటు చేసుకుంది. పోలీసులు ఆందోళన కారులను సముదాయించే ప్రయత్నం చేశారు.

**కాంగ్రెస్ ప్రభుత్వంతో రైతులకు అవస్థలు...**

ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా అన్నదాతల పరిస్థితి తెగిన గాలిపటంలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీ చేశామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉందన్నారు. రైతు భరోసా కింద ఆర్థిక సాయం అందించకపోవడంతో పెట్టుబడికి నగదు లేక రైతులు అల్లాడుతున్నారని వాపోయారు. పెన్షన్లు, రేషన్ కార్డులు ఇలా అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేయాల్సి ఉన్నా, ప్రజా సమస్యలపై పట్టింపు లేకుండా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. రైతులు, సామాన్య ప్రజానికానికి బీఆర్ఎస్ ఎల్లవేళలా అండగా ఉంటుందని, వారికి న్యాయం జరిగేంత వరకు పోరాడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విజ్జగిరి నారాయణ, గండ్రత్ రమేష్, సేవ్వా జగదీష్, చందల రాజన్న, పరమేశ్వర్, కుమ్ర రాజు, అప్కామ్ గంగయ్య, అడపా తిరుపతి, బట్టు సతీష్, యూనిస్ అక్బనీ, సాజిదోద్దీన్, కస్తాల ప్రేమల, స్వరూపరాణి, బొడగం మమతా, పర్వీన్, కరుణ, అశోక్, స్వామి, పవన్ నాయక్, కొండా గణేష్, ధమ్మా పాల్, అన్నెలా వసంత్, ఉగ్గే విఠల్, చెన్నై సాయి పాల్గొన్నారు.

# ప్రభుత్వ గురుకులాల్లోనే పిల్లలను చేర్పిద్దాం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**నవతెలంగాణ-కడెం**

తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు నిర్మాణమవుతుందని, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ గురుకులాలను తీర్చిదిద్దుతున్నామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నచ్చన్‌ఎల్లాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శకుంతలతో కలిసి కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2025కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుపేద విద్యార్థులకు మెరుగైన విద్యనందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్ని గురుకులాలలో డైట్ చార్జీలను పెంచడంతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నామని తెలిపారు. సాంఘిక, గిరిజన, బీసీ గురుకులాలలో 5వ తరగతి ప్రవేశాలకు, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6నుంచి 9తరగతి వరకు, సాంఘిక సంక్షేమ చాలా గౌలిదొడ్డి, అలుగునూరులో 9తరగతి సీఓఈ, అదేవిధంగా ఎస్ఓఈ ఖమ్మం, పరిగి, 8వ తరగతిలో, రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజ్ గిరి ఫైన్ ఆర్ట్ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశాలకు గాను దరఖాస్తులు స్వీకరించబడుతున్నాయని తెలిపారు. అర్హులైన విద్యార్థిని, విద్యార్థులు టీజీసెట్.సీజీజీ.గావ్.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలన్నారు. చివరి తేదీ ఫిబ్రవరి1 అని అప్లై చేసుకునే విద్యార్థినీ, విద్యార్థులు మీ సేవ కేంద్రాలు, ఆన్‌లైన్ సెంటర్లకు తమ వెంట కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, జనన ధృవీకరణ పత్రం, ఫోటో తప్పకుండ తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ పాఠశాల సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు భూక్యా భిక్కు నాయక్ పాల్గొన్నారు.



## ప్రమాదవశాత్తు పత్తికి నిప్పు

నవతెలంగాణ-కౌటాల



మండలంలోని గుడ్లబోరి గ్రామానికి చెందిన ఎగ్గడె మారుతి ఇంటిలో నిలువచేసిన పత్తికి ప్రమాదవశాత్తు సోమవారం నిప్పు అంటుకుంది. మారుతి తండ్రి ఛరందాస్ ఆదివారం రాత్రి మృతి చెందడంతో కుటుంబీకులంతా ఛరందాస్ అంత్యక్రియలకు వెళ్లారు. అంత్యక్రియలు పూర్తి చేసుకుని ఇంటికి వచ్చేసరికి ఇంటిలో ఉన్న 20 క్వింటాళ్ల పత్తికి ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. కాలుతున్న పత్తిని గమనించిన కుటుంబీకులు, స్థానికులు వెంటనే మంటలను ఆర్పారు. అప్పటికే కొంత పత్తి కాలిపోయింది. ఒక వైపు ఇంటి పెద్దను కోల్పోయి బాధలో ఉన్న వారికి పత్తి కాలిపోవడంతో కుటుంబీకులంతా తీవ్ర దు:ఖంలో మునిగిపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

## యువత క్రీడల్లో రాణించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



యువత క్రీడల్లో రాణించాలని సింగల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని రౌటసంకపల్లిలో జరిగిన కబడ్డీ ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కబడ్డీ పోటీల్లో ప్రథమ బహుమతి రాజ్ గోండు జట్టుకు రూ.7000, రెండవ బహుమతి రాజధాని జట్టుకు రూ.5000, తృతీయ బహుమతి బొందగూడ జట్టుకు రూ.3000 నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుండి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించి జిల్లా పేరును నిలబెట్టాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కిష్టయ్య నాయకులు ఎడ్ల పోచయ్య రావుజి, అంబుబాయి, పీఈటీలు సుధాకర్, లక్ష్మణ్, శ్రవణ్ పాల్గొన్నారు.

# వడ్డీ కట్టలేక..అసలు చెల్లించలేక..!

- అప్పులపాలై ఆర్థిక ఇబ్బందుల్లో మాజీ సర్పంచులు
- పదవీకాలం ముగిసి ఏడాదైనా దరిచేరని బిల్లులు
- ప్రభుత్వం స్పందించి విడుదల చేయాలని వేడుకోలు
- మాటలకే పరిమితమైన ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహకం

**గత ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా సర్పంచ్లు సొంత డబ్బులతో అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేశారు. అయితే గత పాలకుల నిర్లక్ష్యంతో చాలా గ్రామాల సర్పంచులకు పనుల తాలూకు బిల్లులు మంజూరు కాలేదు. దీంతో చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక, అసలు తీర్చలేక ఏండ్ల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి. ఈ క్రమంలోనే చాలామంది గ్రామ ప్రథమ పౌరులు గత ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు రాక అప్పుల భారంతో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్పంచుల పదవీకాలం ముగిసి ఏడాది కావొస్తున్న పాత బకాయిల జాడలేదు. పదవీ కాలం ఉన్న సమయంలోనే నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. నూతన ప్రభుత్వం వస్తే తమ బిల్లులు వస్తాయని ఎంతో ఆశాగా చూశారు. వీటి కోసం ఇప్పటికే పలువురికి మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఆ పనులకు సంబందించిన బిల్లులు చెల్లింపుకు మోక్షం లభించడం లేదని పలువురు సర్పంచులు ఆందోళన చెందుతున్నారు. అయితే మరో కొద్ది రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో తమ బిల్లులు చెల్లించి తమను అప్పుల ఊబి నుంచి కాపాడాలని వేడుకుంటున్నారు.**



నవతెలంగాణ-కెరమెరి

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మొత్తం 334 గ్రామపంచాయతీలున్నాయి. ఇందులో రైతు వేదికలు, వైకుంఠ ధామాలు, క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గ్రామాల్లో అంతర్గత రహదారులు, డ్రైనేజీలు తదితర అభివృద్ధి పనులను సర్పంచులు చేపట్టారు. ఎన్ఆర్జీఎస్ కింద శ్మశాన వాటికలు, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలకు సర్పంచులు రూ.లక్షల్లో అప్పులు తెచ్చి పనులు పూర్తిచేసి, బిల్లుల కోసం ఏడాది నుంచి ఎదురుచూస్తున్నారు. సర్పంచ్గా ఎన్నికైనప్పటి నుంచి ఇప్పటికే గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేసినా ఏ పనికి ఇంతవరకు పూర్తి స్థాయిలో బిల్లులు రాలేదని వారు వాపోతున్నారు. పలు జీపీల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం సక్రమంగా బిల్లులు అందక ఆర్థిక ఇబ్బందులు పడినట్టు తెలిపారు. సర్పంచిగా గెలుపొంది అప్పుల పాలయ్యామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలువురు సర్పంచులు అప్పుల బాధ తట్టుకోలేక సాగు భూములు తాకట్టు పెట్టిన దాఖలాలున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కనికరించి బిల్లులు క్లియర్ చేయాలని వేడుకుంటున్నారు.

**ఏకగ్రీవ పంచాయతీలకు మొండిచేయే..**

2018 సర్పంచ్ ఎన్నికల సమయంలో అప్పటి మంత్రి కేటీఆర్ ఏకగ్రీవ సర్పంచ్ల తాలూకు గ్రామాల అభివృద్ధికి రూ.10 లక్షలు ప్రోత్సాహం అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతో కొన్ని గ్రామాల్లో ఏకగ్రీవం వైపే మొగ్గు చూపారు. అభివృద్ధికి నిధులు మంజూరవుతాయన్న ఆశతో నాయకులు సైతం అంగీకరించారు. కానీ గెలిచిన తర్వాత పదవీ కాలం ముగిసిన ఏకగ్రీవ పంచాయతీలకు మొండి చేయి చూపింది. దీంతో సదరు సర్పంచులు పెట్టిన డబ్బులు రాక అప్పుల్లో కూరుకుపోయారు. అదే విధంగా గ్రామాల్లో గత ఎన్నికల సమయంలో గెలుపు కోసం రూ.లక్షల్లో ఖర్చు పెట్టిన ప్రజాప్రతినిధులు సైతం ఉన్నారు. వారు సైతం చేసిన పనులకు బిల్లులు అందక ఎన్నికల్లో పెట్టిన ఖర్చు తిరిగి పొందక తలలు పట్టుకుంటున్నారు.

**తెచ్చిన అప్పులు తీరేనా..?**

రూ.లక్షలు అప్పు తెచ్చి గ్రామాల అభివృద్ధి పనులు చేపట్టామని సర్పంచ్లు చెబుతున్నారు. పనులు పూర్తై ఏండ్లు గడుస్తున్నా ఇంత వరకు బిల్లులు తీసుకోలేదని, తమ పదవీ కాలం ముగిసి ఏడాది పూర్తి కావస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి కూడా ఏడాదయిందని, చేసిన అప్పులైన తీరుతాయో లేదోనని సర్పంచ్లు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పూర్తి చేసిన పనుల బిల్లులను వెంటనే విడుదల చేసి అప్పుల భారంతో మగ్గుతున్న సర్పంచులను ఆదుకోవాలని మంత్రి సీతక్కతో పాటుగా ముఖ్యమంత్రి కోరుతున్నారు.

### బిల్లులు మంజూరు చేసి ఆదుకోవాలి

**తొడసం జగన్నాథరావు, మాజీ సర్పంచ్ సాంగ్వి**



గ్రామంలో చేపట్టిన పనులకు బిల్లులు రాలేదు. ఏడాదిగా బిల్లుల కోసం ఎదురు చూస్తున్నా. గ్రామంలో వివిధ అభివృద్ధి పనులకు అప్పులు చేసి రూ.2,21.228 వెచ్చించా. ఇప్పటివరకు బిల్లులు రాలేదు. పదవీ కాలం ముగుసి ఏడాది కావస్తుంది. డబ్బులు రాక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం మాజీ సర్పంచుల సమస్యలను గుర్తించి, పెండింగ్ బిల్లుల నిధులు విడుదల చేసి ఆదుకోవాలి.

### అప్పులకు వడ్డీలు కడుతున్నా

**లెన్గురే విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ ఖైరి**



పంచాయతీ నిర్వహణ కోసం రూ.లక్షలు అప్పులు చేయాల్సి వచ్చింది. సుమారు రూ.3,45000 అభివృద్ధి పనులు చేపట్టాను. బిల్లులు రావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో అప్పులు ఇచ్చిన వాళ్ళ అడుగుతున్నారు. పంచాయతీలో పనుల కోసం నగలు తాకట్టు, అప్పులు చేసి అభివృద్ధి చేశాను. తెచ్చిన అప్పులకు ప్రతినెలా వడ్డీలు కడుతున్నాను. గత ప్రభుత్వం సర్పంచులను ఉరుకుల పరుగులు పెట్టించింది. సర్పంచ్గా గెలిచిన సంతోషం లేదు. గ్రామాభివృద్ధికి పరితపిస్తే అప్పులే మిగిలాయి. పరిస్థితిని తలుచుకుంటే భయమేస్తోంది. తక్షణమే బిల్లులు చెల్లించాలి.

## మెడికల్ కళాశాల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాల సమస్యలు పరిష్కరించడంతో పాటు డైట్ కళాశాల వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోరారు. జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి సీతక్కకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీ విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. డైట్ కాలేజీలో అడ్మిషన్లు చేయడంతో పాటు అధ్యాపకుల నియామకాలు చేపట్టి రానున్న విద్యా సంవత్సరంలో ప్రారంభించేలా చూడాలన్నారు. మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్లు, అధ్యాపకుల నియమాలు వెంటనే చేపట్టి, వసతి గృహాలు నిర్మాణాలు త్వరగా పూర్తిచేసి విద్యార్థుల కష్టాలు తీర్చాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

## వాలీబాల్ కిట్టు అందజేత



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని చెడువాయి గ్రామ యువకులకు ఎస్ఐ కొమురయ్య వాలీబాల్ కిట్టును సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని, క్రీడల ద్వారా మానసికోల్లాసం ఉంటుందని తెలిపారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు చౌదరి శ్రీనివాస్, సత్తయ్య, యువకులు పాల్గొన్నారు.

## ఘనంగా లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడి జయంతి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అంతర్జాతీయ లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ జయంతిని జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఉబేద్ బిన్ యహియా(తారిక్) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ అంతర్జాతీయ స్థాయిలో 49000 మంది క్లబ్ సభ్యులతో 210 దేశాలలో తమ సేవలు విస్తృతం చేశామన్నారు. అనేక దేశాలలో విపత్కర పరిస్థితుల్లో లయన్స్ క్లబ్ ముందుండి తమ సేవలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి విశాల్, ట్రెజరర్ శ్యామ్, జోనల్ చైర్మన్ శంకర్, డైరెక్టర్లు వెంకట రమణారెడ్డి, వినాయక్ రావు, వెంకన్న, శంకర్, సభ్యులు హకీమ్, భీంరావు పాల్గొన్నారు.

## దండే విఠల్ యువ సైన్యం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని ఎలుకపెల్లి గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు రాచకొండ కృష్ణ, దండేవిఠల్ యువ సైన్యం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలో గెలుపొందిన మహిళలకు ఎస్ఐ కొమురయ్యతో కలిసి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శంకర్ గౌడ్, నాగేష్, మల్లేష్, సంతోష్, రమేష్, మాజీ సర్పంచ్ చంద్రమౌళి, మాజీ ఉపసర్పంచ్ రమేష్ పాల్గొన్నారు.

## 7న నరేంద్రచార్యాజి మహారాజ్ పాదుక దర్శనం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 17న జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో జగద్గురు నరేంద్రచార్యజీ మహారాజ్ పాలక దర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు చందనకడ్ బాలాజీ, జిల్లా నిరక్ష్ దిలీప్ గైక్వాడ్, ధర్మక్షేత్ర ప్రముఖులు పండరి చాప్లేలు కోరారు. పాదుక దర్శనంతో పాటు ఉపాక్ దీక్ష నిర్వహించడం జరుగుతుందని, అదే రోజు ఉదయం సాయిబాబా ఆలయం నుండి ర్యాలీ ఉటుందన్నారు. దీనికి ముఖ్య అతిథులుగా ఆసిఫాబాద్, సిర్పూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, హరీష్ బాబుతో పాటు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## నేటి నుంచి భీం స్మారక వాలీబాల్ టోర్నమెంట్

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

కుమురం భీం స్మారక వాలీబాల్ టోర్నమెంట్‌ను మండలంలోని కమ్మర్‌గాం గ్రామంలో నేటి నుండి నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు టోర్నమెంటులో పాల్గొనేందుకు 8317570844ను సంప్రదించాలన్నారు.

# వాహనదారులు నిబంధనలు పాటించాలి

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రమాదాల నివారణకు వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలో రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని రవాణాశాఖ అధికారి రాంచందర్ అధ్యక్షతన నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. అనతరం కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి నడిపిన బైక్ ర్యాలీకి హెల్మెట్ ధరించి ఎమ్మెల్సీ దండే విఠల్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలు పాటించినప్పుడే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. భద్రత మాసోత్సవాలు నెలకు మాత్రమే పరిమితం కాదని నిరంతరం నిబంధనలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలు చైతన్యవంతులైనప్పుడే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి సుగుణక్క, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యామ్‌నాయక్, రవాణా శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రవేశాలకు ప్రచార కార్యక్రమం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశాలతో పాటు ఖాళీ అయిన 6, 7, 8, 9 తరగతుల ప్రవేశాల కోసం స్థానిక సాంఘిక సంక్షేమ పాఠశాల ఉపాధ్యాయులు మండలంలోని సింగరావుపేట, ఈదులవాడ, బూరుగూడ గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ప్రవేశాల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విద్య బోధన పేద విద్యార్థులకు గురుకుల ద్వారా అందిస్తుందన్నారు. ఉచితంగా విద్య, పుస్తకాలు, దుస్తులు అందించడంతో పాటు ప్రతి నెల నిర్వహణ కోసం కొంత మొత్తాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 1లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజన్న, రమేష్, సంపత్, సంతోష్, దుర్గం శ్రీనివాస్ పాల్గొన్నారు.

# భీం పోరాట స్ఫూర్తితోనే తెలంగాణ సహకారం

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క
- జోడేఘాట్‌లో రూ.5 కోట్ల పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-కెరమెరి

అణగారినవర్గాలు, ఆదివాసీ ప్రజల అభివృద్ధియే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం మండలంలోని చారిత్రాత్మకమైన ప్రాంతం, ఆదివాసుల అమరుడు అసువులు బాసిన పోరుగడ్డ జోడేఘాట్‌ను మంత్రి సందర్శించారు. వసతి కల్పనకు పర్యాటకశాఖ నుంచి రూ.5కోట్లతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆదివాసుల హక్కుల కోసం జల్ జంగిల్ జమీన్ నినాదంతో పోరాటం చేసిన భీం ప్రాణ త్యాగాలున్నాయన్నారు. చరిత్రను తిరిగి రాసిన జోడేఘాట్ ప్రాంతాన్ని చారిత్రాత్మకమైన్ టూరిజం ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భీం వర్ధంతి, జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ ప్రాంత ఆదివాసుల డిమాండ్ మేరకు అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు ముందుకుళ్తున్నాయన్నారు. సందర్శనకు వచ్చే పర్యాటకులకు భీం చరిత్ర తెలియజేయడంతో పాటు ఆయన స్ఫూర్తిని తెలియజేసేల అభివృద్ధి చేస్తామన్నారు. ఆదివాసులను విద్యలో ముందుకు తీసుకెళ్లే చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ట్రైబల్ అడ్వైజరి కమిటీ సమావేశం ఏర్పాటు చేసుకొని ఆదివాసుల అభివృద్ధికి సంక్షేమానికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించి ప్రణాళికను తయారు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఆదివాసులకు దుప్పట్లు పంపిణీ చేశారు.



**తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన భీం**

తెలంగాణ ఉద్యమానికి నిజాంకు వ్యతిరేకంగా జల్‌జంగల్‌జమీన్ పేరుతో ఉద్యమించిన భీం స్ఫూర్తి ఇచ్చిందని మంత్రి అన్నారు. తెలంగాణ ప్రాంతం కూడా నీళ్ళు నిధులు నియామకాల కోసం సుదీర్ఘంగా పోరాడి ఇక్కడి ప్రజలు తెలంగాణలో సహకారం చేసుకున్నట్టు పేర్కొన్నారు. భీం స్ఫూర్తితోనే తెలంగాణ సాధించడం జరిగిందన్నారు. సీఎం కూడా ఆదివాసులకు పథకాలను అమలే చేసేల ప్రణాళికలు చేశారన్నారు. అనంతరం ఆమె ఆదివాసీ సాంప్రదాయ దుస్తులు, అలంకరణ అభరణాలు ధరించి, మహారాష్ట్ర తెలంగాణ సరిహద్దులో కొనసాగుతున్న, గిరిజన ఆరాధ్యదైవం జంగు బాయిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కొక్కిరాల విశ్వ ప్రసాద్ రావు, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ పాల్గొన్నారు.

## వంతెనలు పూర్తి చేయాలని వినతి

నవతెలంగాణ-కెరమెరి



మండలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన వంతెన పనులను పూర్తిచేయాలని సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు రాథోడ్ రమేష్ కోరారు. ఈమేరకు మండలంలో పర్యాటించిన మంత్రి సీతక్కను జంగుబాయి పుణ్యక్షేత్రంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనార్‌పల్లి వంతెన మంజూరై 8 ఏండ్లు అవుతుందని పనులు పిల్లర్ల దశలోనే నిలిచి పోయాయని మంత్రికి వివరించారు. లక్మాపూర్ వంతెన పనులు చివరి దశలో నిలిచి పోయాయని, దీంతో వర్షాకాలం పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లాగా సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని ఎర్రగుంట గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొంబాయిగూడ నుండి ఎర్రగుంట గ్రామానికి వంతెన, బీటీ రోడ్డు మంజూరు చేయగా ఎన్నికల కోడ్ రావడంతో అధికారులు పనులు నిలిపివేశారన్నారు. ఎన్నికలు పూర్తయిన వెంటనే పనులు మొదలుపెట్టి పూర్తి చేయడంతో ఎన్నో సంవత్సరాల కలను మాజీ ఎమ్మెల్యే సాకారం చేశారని తెలిపారు. అందుకే ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు వైకుంఠం, లక్ష్మీనారాయణ, తిరుపతి, బాపురావు, రఘునాథ్, బండి చలం పాల్గొన్నారు.

## ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో జీఓ కాపీల దహనం

నవతెలంగాణ-జన్నారం




మండలం చింతగూడ గ్రామం పరిధిలో అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) జిల్లా అధ్యక్షుడు లాల్ కుమార్ అధ్వర్యంలో సోమవారం జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధాన ముసాయిదా బిల్లును ఉపసంహరించుకోవాలనీ డిమాండ్ చేస్తూ జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధాన ముసాయిదా బిల్లు జీఓ కాపీలను దగ్ధం చేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట



సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణంలోని ఉత్కూర్ గ్రామంలో ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గోన్నారు. ఈ పోటీలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి, రెండో బహుమతి, మూడవ బహుమతి లతో పాటు ఈ ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలకు షీల్డ్ లు అందజేయడం జరుగుతుందని ఆదర్శ యూత్ గౌరవాధ్యక్షులు ఆయిల్ల సతీష్ పాల్గొన్నారు.

## కోడి పందాల స్థావరంపై పోలీసుల దాడి



నవతెలంగాణ-జైపూర్

జైపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి కిష్టాపూర్ గ్రామ శివారు కోడి పందాల స్థావరంపై స్థానిక ఎస్ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. కిష్టాపూర్ శివారులో డబ్బులు పందెంగా పెట్టి కోడి పందాలు ఆడుతున్నట్లు అందిన పక్కా సమాచారంతో నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన 12 మంది నిందితుల నుండి రెండు కోడి కత్తులతో పాటు 8 మొబైల్ ఫోన్లు, రూ.44,220, నగదును స్వాధీనం చేసుకున్నారు.. కోడి పందాలు నిర్వహిస్తూ పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

## చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన మంతెన అంజన్ రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్‌లో ప్రతిభ కనబర్చడం అభినంద నీయమని నేతకాని మహర్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత అన్నారు. కలమడుగు జిల్లా పరిషత్ పాఠశాల నుంచి రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరచి మొదటి విజేతగా అవార్డును అందుకోవడం తల్లితండ్రులకు, గ్రామానికి తను చదువుతున్న పాఠశాలకు గౌరవప్రదమని అన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ నేత విద్యార్థికి మేమొంటోను అందించి శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షులు జాడి గంగాధర్, నేతకానీ కుల సంఘ నాయకులు జూనుగురి మల్లయ్య, నాయకులు వొళ్లాల నర్సగౌడ్, మంతెన వెంకటేష్, రమేష్, ముజ్జన్నా పాల్గొన్నారు.

## పశు గణన షురూ..



నవతెలంగాణ-లక్షెట్టిపేట

జనాభా లెక్కల మాదిరిగానే పశు సంవర్థక శాఖ పశు గణన కార్యక్ర మాన్ని చేపడుతోందని వెటర్నరీ అసిస్టెంట్ గంగ మల్లు తెలిపారు. ప్రతీ ఐదేళ్లకు ఒకసారి పశువులను లెక్కిస్తోంది. సోమవారం పట్టణంలోని 11వ వార్డు, 12వ వార్డులో పశుగణన సిబ్బంది ఇంటింటికి వెళ్లి రైతుల వద్ద వివరాలు సేకరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మచ్చ గంగమల్లు, ఎండీ ఎజాస్ అలీ, రైతులు పాల్గొన్నారు.

## వాడవాడలా ఘనంగా ముగ్గుల పోటీలు



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని అన్ని గ్రామాలలో మహిళలకు, యువతులకు నిర్వాహకులు ముగ్గుల పోటీలు నిర్వహించారు. భోగి సందర్భంగా పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో మహిళలకు, యువతులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఉత్సాహంగా పాల్గొని అందమైన ముగ్గులు వేశారు. వారిలో విజేతలను ఎంపిక చేసి నిర్వాహకులు బహుమతులను అందజేస్తారు. పొనకల్ గ్రామంలో రాఘవేంద్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎర్ర చంద్రశేఖర్ అధ్యక్షతన ముగ్గుల పోటీలు నిర్వహించారు. పొనకల్ పట్టణంలోని తొమ్మిది సెంటర్లలో రాంనగర్, అక్క పెళ్లి గూడా, శ్రీలంక కాలనీ, రాఘవేంద్ర కరిమల కళాశాల, రాఘవేంద్ర సినిమా థియేటర్, పొనకల్, గాంధీనగర్, జువ్విగూడా, వినాయక నగర్‌లలో ఘనంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలలో సుమారు 700 మంది మహిళలు పాల్గొన్నారు. ఇందులో ప్రతి వాడకు ప్రథమ, ద్వితీయ, తృతీయ కన్సోలేషన్ ప్రైజ్‌లు అందజేశారు.

## నేత్రపర్వంగా గోదాదేవి సమేత రంగనాథుని కళ్యాణం

**జన్నారం :** మండలంలోని పోన్కల్ గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో గోదాదేవి సమేత రంగనాథుని కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. భోగి పండుగను పురస్కరించుకొని సోమవారం ఆ దేవాలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి వేద పండితులు పలు పూజలు నిర్వహించారు. ఆ దేవాలయం ఆవరణలో గోదాదేవి సమేత రంగనాథుని మూల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు ప్రసాద వితరణ నిర్వహించారు.

# ఆస్పత్రి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ-మంచిర్యాల



తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బెల్లంపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఆకులు తింటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిలన్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్బోజు రమణ, దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకోకపోవడంతోనే నిరసన కార్యక్రమం నిర్వహించామన్నారు. పీఎఫ్ పేరుతో కోత విధించిన డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమ చేయడం లేదని, యూనిఫామ్, గుర్తింపు కార్డులు ఇవ్వడం లేదని, వేతనాల చెల్లింపులు విషయంలో కూడా అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వెంటనే ఏజెన్సీని బ్లాక్ లిస్టులో పెట్టి కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలను కార్మికులకు చెల్లించాలని కోరారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడుతూ కోత విధించిన పీఎఫ్ డబ్బులు కార్మికుల ఖాతాలో జమ చేయాలని, యూనిఫామ్, ఐడీ కార్డులను అందించాలని కోరారు. ప్రతి నెల మొదటి వారంలో వేతనాలు చెల్లించాలని లేనట్లయితే ఈ నెల 20న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దూలం శ్రీనివాస్, బెల్లంపల్లి మండల కన్వీనర్ చల్లూరి దేవదాస్ పాల్గొన్నారు.

# పాఠశాల విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి




నవతెలంగాణ-జన్నారం

మారుతున్న కాలానికి అనుగుణంగా పాఠశాల విద్యలో మార్పులు చేసి పాఠశాల విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. "పాఠశాల విద్య బలోపేతంలో ఉపాధ్యాయుని పాత్ర" అనే అంశంపై ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్యగా అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు నమోదు క్రమంగా తగ్గుతుందని పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రభుత్వ పాఠశాల మనుగడ, ఉపాధ్యాయుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందన్నారు. పాఠశాలల నిర్వహణ లోపం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో జరిగే బోధన అభ్యసన ప్రక్రియపైన పర్యవేక్షణ కొరవడిందన్నారు. పర్యవేక్షణకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేసి నెలకోసారి విద్యార్థుల ప్రగతిపై సమీక్షించాలన్నారు. అన్ని సామాజిక వర్గాల పిల్లలు ఒకే పాఠశాలలో చదివేలా నర్సరీ నుంచి పదవ తరగతి వరకు ఉండేలా సమీకృత గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టి విద్యార్థులు ఉన్న పాఠశాలకు ఉపాధ్యాయులను బదిలీ చేయాలి. ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు టైమ్ బెలు, రెండు జతల బూట్లు, స్కూల్ బ్యాగు ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంపు అనే ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలన్నారు. అనంతరం కాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బాధావత్ ప్రకాష్ నాయక్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామ టెంక శ్రీనివాస్, భూక్యా రాజన్న, జిల్లా గౌరవ అధ్యక్షుడు జాడి ప్రభాకర్, మండల అధ్యక్షుడు తుంగూరు గోపాల్ సంఘం బాధ్యులు బుక్య రవీందర్ దుర్గం రాజలింగం, జాడి రాజలింగం, రాజు, ధర్మయ్య, దేవ్ సింగ్ పాల్గొన్నారు.

# గిరి ప్రదక్షిణలో భారీగా పాల్గొన్న భక్తులు

నవతెలంగాణ-జైపూర్

ప్రసిద్ధి చెందిన వేలాల గట్టుమల్లన్న గిరి ప్రదక్షిణలో భక్తులు భారీగా పాల్గొన్నారు. ప్రతి నెల ఆరుద్ర నక్షత్రం రోజున గట్టుమల్లన్న సన్నిధిలో గిరి ప్రదక్షిణ కొనసాగుతుంది. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన గిరి ప్రదక్షిణ మధ్యాహ్నం ఒంటి గంట వరకు సాగింది. భక్తుల సౌకర్యార్థం మంచిర్యాల ఆర్టీసీ బస్సు డిపోకు చెందిన బస్సు సర్వీస్ మంచిర్యాల నుంచి వేలాలకు ఉదయం 7.30 గలకు బయలుదేరి 8.30 గంటలకు వేలాలకు చేరుకుంది. కాగా 3వ గిరి ప్రదక్షిణలో అయోధ్య నుంచి వచ్చిన శ్రీరామ స్వర్ణ పాదుకలతో చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులుల సురేష్ ఆత్మారాం మహర్ ఆధ్వర్యంలో





సుమారుగా 15 వందల మంది భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. గిరి ప్రదక్షిణకు ముందు వేలాల గ్రామంలో గల మల్లిఖార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం ఆయలం నుంచి వేలాల శివారు గుట్టపై వెలిసిన గట్టుమల్లన్న ఆలయం వరకు పాదయాత్రగా బయలుదేరిన భక్తుల గిరి ప్రదక్షిణ అతనంరం గట్టుమల్లన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదవ కులదైవమైన మల్లిఖార్జునస్వామి గిరి ప్రదక్షిణలో ఒగ్గు పూజారులు, కళాకారులు డోలు వాయిద్యాలు ప్రత్యేక ఆకర్శనగా నిలిచాయి. గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు గిరిప్రదక్షిణ కమిటి ఆధ్వర్యంలో దాతల సహాయ సహకారాలతో అన్నధాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

## ఘనంగా బోగి వేడుకలు

నవతెలంగాణ-మంచిర్యాల



జిల్లా కేంద్రంలో బోగి పండుగను సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. బాలుర పాఠశాల మైదానంలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలోలో తెల్ల వారు జామున బోగి మంటలు ఏర్పాటు చేశారు. వాకర్స్ క్లబ్ సభ్యులు అందరూ సంప్రదాయా దుస్తులు ధరించి పండుగ సంబరాలు చేసుకున్నారు. మహిళలు ఉదయం నుంచే వాకిట్లో రంగులతో ఆకర్షనియమైన ముగ్గులు వేశారు. నవ దాన్యలతో పాటు గోబ్బేమ్మలను ముగ్గులో ఉంచారు. కుటుంబ సభ్యులు సంప్రదాయం ప్రకారం చిన్నారులకు బోగి పండ్లు పోసి మంగళ హరతులు ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని పలు కాలనిల వాసులు తెల్లవారు జామునే లేచి బోగి మంటలు ఏర్పాటు చేయడంతో పట్టణం అంత పండగ వాత వరణం నెలకొంది.

## ఘనంగా గోదారంగనాయకులు కళ్యానోత్సవం



నవతెలంగాణ-జైపూర్

మండలంలోని షెట్‌పల్లి గ్రామంలో గల కోదండ రామాలయంలో సోమవారం గోదారంఘనాయకుల కళ్యానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు అల్లాడి గోపాకృష్ణమాచార్యులు, కనగర్తి మదుసూధనాచార్యులు గోదాకళ్యానోత్సవాన్ని నిర్వహించారు. మకర సంక్రాంతికి ముందు రోజు గోదారంఘనాయకుల కళ్యాణం నిర్వహించడం ఆచారంగా వస్తోందని తెలిపారు. స్వామివారి కళ్యానోత్సవం తిలకించేందకు షెట్‌పల్లి గ్రామంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చారు.

**భీమారంలో..**

భీమారం మండల కేంద్రంలో గల కోదండ రామాలయంలో సోమవారం గోదారంఘనాయకుల కళ్యానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటి ఆధ్వర్యంలో ప్రధానార్చకులు తిరునగి కన్నయ్య, ప్రవీణ్‌తో పాటు గ్రామ పురోహితులు విశ్వేశ్వర్, సంతోష్, శ్రీమన్నారాయణలు కన్నుల వండువగా కళ్యానోత్సవం నిర్వహించారు. కళ్యానోత్సవాన్ని తిలికించేందుకు గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



## జన్నారంలో రోడ్డు ప్రమాదం

- ఆటో డ్రైవర్‌తో సహా నలుగురికి స్వల్ప గాయాలు



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని ఆంధ్ర కాలనీ ప్రధాన రహదారిపై సోమవారం ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు, సహా డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు 108 సమాచారం అందించడంతో హుటాహుటిన వచ్చిన 108 సిబ్బంది వారిని లక్షెట్టిటిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంచిర్యాల నుంచి నిర్మల్ వెళ్తుండగా, జన్నారం నుంచి మందపల్లి వైపై వెళ్తున్న ఆటోను వెనుక నుంచి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఆటో డ్రైవర్ తిరుపతి కిష్టాపూర్ గ్రామానికి చెందిన గంగవ్వ, స్రవంతి, హారికకు స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు.

## గల్ఫ్ సంక్షేమ సమితి సేవలు అభినందనీయం




నవతెలంగాణ-జన్నారం

పేదల కోసం గల్ఫ్ సంక్షేమ సమితి చేస్తున్న సేవలు అభినందనీయమని జన్నారం ఎస్ఐ గుండేటి రాజ వర్ధన్ అన్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గల్ఫ్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ఈ సమితి చేస్తున్న సేవలు అభినందనీయమని, సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. సమితి సభ్యులు ఈ క్యాలెండర్ ద్వారా అందిస్తున్న సందేశం గల్ఫ్ కార్మికుల ఐక్యత, వారి కుటుంబాలకు భరోసా అనే సమాచారం అందించబడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ కొత్తపెల్లి భాస్కర్, లింగన్న, కమిటీ సభ్యులు, సేపూరి గోపాల్, శివనూరి శ్రీనివాస్, ఉప్పు భూమారెడ్డి, గోనెగట్టయ్య పాల్గొన్నారు.

## ఎస్టీపీపీని సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి



నవతెలంగాణ-జైపూర్

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ రాధారాణి ఆదివారం రాత్రి జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌ను సందర్శించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా ఎస్టీపీపీని సందర్శించినట్లు తెలిసింది. జిల్లా పర్యటనలో భాగంగా కాళేశ్వరం ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఎస్టీపీపీని సందర్శించిన న్యాయమూర్తి రాధారాణికి ప్లాంట్ డీజీఎం ఆపరేషన్స్ వేణుగోపాల్‌రావు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఘాకూర్ మోహన్‌సింగ్, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ విష్ణువర్ధన్‌రెడ్డి పూల మొక్కను బహూకరిస్తూ స్వాగతం పలికారు.

## స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసుల పంపిణీ



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రానికి చెందిన కాసిపేట గ్రామ మిత్ర బృందం ఆధ్వర్యంలో సోమవారం విశిష్టమైన రోజు కావడంతో మండల శివారులోని బుగ్గ దేవాలయంలో స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులు పంపిణీ చేశారు. బుగ్గ దేవాలయం పరిసరాల్లో ప్లాస్టిక్‌ను నిషేదించడంతో పర్యావరణ రక్షణలో భాగంగా కాసిపేట గ్రామ మిత్ర బృందం ఆధ్వర్యంలో 50 స్టీల్ ప్లేట్లు, రాపర్తి పద్మ, వెంకటేశ్ దంపతుల ఆధ్వర్యంలో 50 స్టీల్ ప్లేట్లు, ఉటూరి సాయి కుమార్ ఆధ్వర్యంలో 100 స్టీల్ గ్లాసులు అందించారు. దీంతో పాటు ఆలయానికి వచ్చిన భక్తులకు కాసిపేట గ్రామ మిత్ర బృందం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. 110 ఏళ్లకు ఒక సారి వచ్చే ప్రత్యేకమైన శివుని దేవుడికి ఇష్టమైన రోజు కావడంతో పాటు భోగి, పౌర్ణమి, ఆరుద్ర నక్షత్రం ఒకేసారి రావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల కోసం స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులు అందించినట్లు దాతలు తెలిపారు. అనంతరం దాతలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు.

## రెవ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



రెవ(రజక ఎంప్లాయిస్ వెల్ఫర్ అసోసియేషన్) నూతన ఆంగ్ల సంవత్సరం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే పాయల శంకర్ ఆవిష్కరించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పాయల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం క్యాలెండర్ అవిష్కరిపింపజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు అరుగుల స్వామి, అధ్యక్షులు ముస్కు స్వామి, ప్రధాన కార్యదర్శి అంపెల్లి లక్ష్మి నారాయణ, మున్సిపల్ కమిషనర్ సీవీఎస్ రాజు, నాలుగవ తరగతి యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాధర్, బండి అశోక్, సట్ల శంకర్, జి.పొచ్చయ్య, ఏ.శ్రీనివాస్, జి.గోపాల్ పాల్గొన్నారు.

## పోరు గ్రామాల సమస్యలపై వినతి

నవతెలంగాణ-కెరమెరి



నిజాం ప్రభుత్వంతో పోరాడిన పోరుగ్రామాల సమస్యలను పరిష్కరించాలని సోమవారం కుమురం భీం ఉత్సవ కమిటీ చైర్మన్ పెందూర్ రాజేశ్వర్ పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా 12 పోరుగ్రామాల్లోని ఆదివాసీ గిరిజనులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. జోడేఘాట్ నుంచి ఆసిఫాబాద్‌కు మార్గమధ్యలో 3కిమీ రోడ్డు మంజూరు చేయాలని వినతిపత్రంలో విన్నవించారు. ఘాట్ రోడ్డులో రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేస్తే జిల్లా కేంద్రానికి దూరభారం తగ్గుతుందని మంత్రికి విన్నవించగా సానుకూలంగా స్పందించారన్నారు.

## సూపర్ స్పెషాలిటీని తనిఖీ చేసిన ఎమ్మెల్యే

- అపరిశుభ్రతపై ఆగ్రహం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని సోమవారం ఎమ్మెల్యే పాయల శంకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. వారికి అందుతున్న వైద్య సేవల గురించి వైద్యులతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి పరిసరాలను పరిశీలించిన ఎమ్మెల్యే రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మరుగుదొడ్లు, మూత్రశాలలు అపరిశుభ్రంగా ఉండటంతో సానిటేషన్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఇక్కడి అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన వైద్యమందించాలని ఆదిలాబాద్‌కు సూపర్ స్పెషాలిటీ కేటాయించిందన్నారు. ఆస్పత్రితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఎప్పటికప్పుడు ఉంచాలని, సంబంధిత కాంట్రాక్ట్ సిబ్బందికి సూచించారు. ఆస్పత్రికి నిరుపేద రోగులు ఎంతో మంది వైద్యంపై నమ్మకంతో వస్తారని, వారికి కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌కు సూచించారు. ఆస్పత్రి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం కారణమని మండిపడ్డారు. అదేవిధంగా ఆస్పత్రి ప్రారంభమైన 3 ఏండ్లకే సీలింగ్ ఊడిపోవడంపై ఆశ్చర్యం కలిగిస్తుందని అన్నారు. ఆస్పత్రిలో పూర్తి సౌకర్యాలతో పాటు, పరిశుభ్రమైన వాతావరణం, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మయూరి చంద్ర, నిఖిల్, లింగన్న నారాయణ ఉన్నారు.

## 21 నుంచి రైతు భరోసా గ్రామ సభలు

నవతెలంగాణ-సిరికొండ

మండలంలో ఈనెల 21 నుంచి రైతు భరోసా గ్రామ సభలు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ రవీందర్ అన్నారు. 21వ తేదీన కొండాపూర్, పోచంపల్లి, కన్నపూర్, సిరికొండ, రాంపూర్(బి), 22వ తేదీన సుంకిడి, లచ్చింపూర్(బి), రిమ్మ, 23వ తేదీన నారాయణ్ పూర్, నేరడిగొండ(జి), పొన్న, రాయిగూడ, ఫకీర్ నాయక్ తండ, 24వ తేదీన జెండగూడ, కుంటగూడ, సొంపల్లి, వాయిపేట్, 25వ తేదీన ధర్మసాగర్, గ్రామాల్లో రైతు భరోసా, గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రైతులు, గ్రామస్తులు గ్రామ సభలకు హాజరై సహకరించాలని కోరారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తామని, ఆ తర్వాత ఆన్‌లైన్ చేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని, సాగుకు ఆమోదయోగ్యంగా లేని భూములను తొలగించి, అర్హులైన వారికి రైతు భరోసా కింద ఎకరానికి రూ.12 వేల చొప్పున ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని రాజురా గ్రామానికి వెళ్ళే రహదారి నిర్మాణ పనులను పరిశీలించి పుష్య పౌనమి సందర్భంగా గ్రామంలోని జగదాంబ దేవి, సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి సక్రియా నాయక్ తాండా గ్రామానికి చెందిన గ్రామ కారోబరి రాథోడ్ సుదర్శన్ ఇటీవలే అనారోగ్యంతో మరణించగా విషయం తెలుసుకొని వారి కుటుంబ సభ్యులకు పరామర్శించారు. ఆయనతో పాటు ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులున్నారు.

## 17న వాహనాల వేలం

నవతెలంగాణ-ఉట్నూర్

ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు మూడు పెద్ద వాహనాలకు 17న వేలం పాట నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. ఐటీడీఏ కార్యాలయంలో ఉదయం నిర్వహించే ఈ వేలం పాటలో పాల్గొనే ఔత్సహికులు రూ.పది వేల డీడీని ఐటీడీఏ పీఓ పేరు తీసుకొని ఒక రోజు ముందు కార్యాలయంలో సమర్పించాలన్నారు.


## పరీక్ష ఫీజు చెల్లించేందుకు నేడే ఆఖరు గడువు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లించడానికి గడువు పొడగించినట్లు ఆదిలాబాద్ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంగీత, ఉమ్మడి జిల్లా యూనివర్సిటీ కోఆర్డినేటర్ జగ్‌రామ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ మొదటి, రెండవ, మూడవ సంవత్సరం స్పెల్-2, ఓల్డ్ బ్యాచ్-2016, అంతకుముందు బ్యాచ్‌ల వారిగా, రీ అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులు సప్లమెంటరీ ఫీజు చెల్లించుటకు ఈనెల 14 వరకు రూ.500 అపరాధ రుసుంతో పొడిగించడం జరిగిందని పేర్కొన్నారు. పరీక్ష ఫీజును ఏదైనా టీఎస్ ఆన్‌లైన్ సెంటర్‌లో గానీ లేదా మీసేవ కేంద్రాల్లో గాని చెల్లించి, రసీదును పొందాలని సూచించారు. పరీక్షల టైం టేబుల్ యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు వెల్లడించారు. పూర్తి వివరాల కొరకు సెంటర్‌ను సంప్రదించవచ్చని సూచించారు.

# పోతురాజు,ధర్మ రాజు ఉత్సవాలకు వేళాయె..

- 15 నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ
- ఉమ్మడి జిల్లా నుంచి తరలిరానున్న భక్తులు




నవతెలంగాణ-కెరమెరి

కొలం ఆదివాసులు కొలిచి పూజించే ఆరాధ్య దైవం పోతురాజు, ధర్మరాజు ఉత్సవాలకు మండలంలోని లింగాపూర్ సమీపంలోని ఆలయం ముస్తాబైంది. ఉత్సవాలకు సంబంధించి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం ఆలయంలో పూజలు ప్రారంభం కానున్నాయి. ఆదిమ తెగల్లోని కోలాం జాతుల్లో నాలుగు గోత్రాలు సిడాం వారికి చెందిన కులదైవం పోతురాజు, ధర్మరాజుకు మూడు రోజులు సాంప్రదాయ బద్దంగా పూజలు నిర్వహించనున్నారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర నుంచి కూడా వందలాదిగా భక్తులు తరలి రానున్నారు. పోతురాజు, ధర్మారాజు కోరిన కోర్కెలు తీర్చే దైవంగా ప్రసిద్ధి చెందింది. ప్రతి ఏడాది ఈ ఉత్సవాలకు జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు ఆదివాసీ ప్రజలతో పాటు ఇతర ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. పోతురాజు ధర్మరాజు ఉత్సవాలు ఈనెల 15, 16, 17 తేదిల్లో కొనసాగానున్నాయి.



**ఆలయంలో నిర్వహించే పూజలు**

బుధవారం సాయంత్రం 6 గంటలకు సింగర్‌వాడిలో పూజలతో ఉత్సవాలు ఆరంభమవుతాయి. రాత్రి 9 గంటలకు ధర్మరాజు పోతురాజుకు నైవేద్యం సమర్పిస్తారు. రాత్రి 9:30 గంటలకు పెద్ద దేవునికి పూజలు నిర్వహిస్తారు. సోమవారం తెల్లవారుజామున మూడు గంటలకు బోనం సమర్పిస్తారు. నాలుగు గంటలకు కట్టు కట్టడం కార్యక్రమం నిర్వహించి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. ఉదయం ఏడు గంటలకు భక్తులకు ఆశీర్వాదం 8 నుంచి 10 గంటల వరకు భోజన కార్యక్రమం ఉంటుంది. 11 గంటలకు మైసమ్మకు పూజలు చేసి మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకు అమ్మవారికి పూజలు నిర్వహించి రెండు నుంచి నాలుగు గంటల వరకు మొక్కులు చెల్లిస్తారు. సాంప్రదాయ ముత్యాలు చేస్తారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు లక్ష్మి పూజ ఆరు గంటలకు దేవుళ్లను గుడిలో లోనికి సాగనంపి కార్యక్రమాలు చేపడుతారు. అదే విధంగా ఈ ఉత్సవాల సందర్భంగా క్రీడా పోటీలను నిర్వహిస్తారు. క్రీడల్లో గెలుపొందిన బహుమతులు ప్రధానం చేయడం అనావాయితీగా వస్తుంది.

### కోలాం ఆదివాసులు ఆరాదించే దైవం

**సిడాం రాజు, ఆలయ కమిటీ చైర్మన్**



కోలాం ఆదివాసులు ఆరాదించే ఇష్ట దైవం పోతురాజు ధర్మరాజు. ఈ ఉత్సవాలు మూడు రోజులు కొనసాగుతాయి. ఉమ్మడి జిల్లాతో పాటు మహారాష్ట్రలో వివిధ తాలూకాలోని కోలాం ప్రజలు భారీగా తరలివస్తారు. ప్రత్యేక పూజలు చేస్తారు. నైవేద్యాలు సమర్పిస్తారు. సాంప్రదాయ పూజలు, మొక్కులు తీర్చుకుంటారు.

### కోరికలు నెరవేర్చే దేవునిగా ప్రసిద్ధి

**సిడాం ధర్ము, ఆలయ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు**



కోరిన కోరికలు తీర్చే దేవుడిగా పోతురాజు, ధర్మరాజు ప్రసిద్ధి చెందారు. అనేకమంది ఆదివాసీ కోలాం ప్రజలు మొక్కుతారు. కుల మతాలకతీతంగా ఈ ఉత్సవాలకు జనాలు తరలివస్తారు. మనసులో ఉన్న కోరికలను కోరితే నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. భక్తులకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తాం.

# అభివృద్ధి పనులతో సాగిన మంత్రి పర్యటన

- రూ.6 కోట్ల 60 లక్షల పనులకు శంకుస్థాపనలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర మంత్రి సీతక్క పర్యటన ఆసిఫాబాద్ జిల్లాలో సోమవారం వేగంగా సాగింది. ఆదివారం రాత్రి రెబ్బెన మండలం గోలేటిలోని సింగరేణి గెస్ట్ హౌస్‌కు చేరుకున్న మంత్రికి కాంగ్రెస్ శ్రేణులు స్వాగతం పలకగా, ఉదయం కలెక్టర్ వెంకటేష్ ధోత్రే మర్యాద పూర్వకంగా వేసి పుష్పగుచ్చం అందించారు. అనంతరం పర్యటన ప్రారంభం కాక ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన మంత్రి రెబ్బెన, ఆసిఫాబాద్, కెరమెరి మండలాల్లో రూ.6 కోట్ల పైచిలుకు పనులకు భూమి పూజ, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. వీటిలో రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించనున్న శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ ఆర్చ్ పనులకు శంకుస్థాపన చేయగా అక్కడినుండి ఆసిఫాబాద్‌కు చేరుకుని, జన్కాపూర్‌లో రూ.కోటి 35 లక్షలతో బాల సదన్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. రూ.19 లక్షలతో నిర్మించిన ఆదర్శ అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. వాంకిడి మండల కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను జూనియర్ కాలేజ్‌గా ఉన్నతీకరించారు. కెరమెరి మండలం జోడేఘట్‌లో పర్యాటక అభివృద్ధికి రూ.4 కోట్ల 96 లక్షలతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు.

**ఆదర్శ అంగన్‌వాడీలో మంత్రి అన్నప్రాసన**

జిల్లా కేంద్రాల్లోని ఆదర్శ అంగన్‌వాడీ ప్రారంభించినంతరం మంత్రి సీతక్క, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే చిన్నారికి అన్నప్రాసన చేసి ఆశీర్వదించారు. అంగన్‌వాడీ విద్యార్థులకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ విఠల్, డీసీసీ అధ్యక్షులు విశ్వప్రసాద్, పార్లమెంట్ ఇన్‌చార్జి సుగుణక్క, మాజీ ఎమ్మెల్యే సుగుణక్క, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, డీడబ్ల్యూఓ భాస్కర్, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు చరణ్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్యామ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, కాంగ్రెస్ నాయకులు, అధికారులు , మాజీ సర్పంచ్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పండుగలు సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీక

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



నవతెలంగాణ-భైంసా

పండగలు సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు. సోమవారం భైంసాలోని నర్సింహా కల్యాణ మండపంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నారులు, మహిళలు, మన సంస్కృతిని ప్రతిబింబిస్తూ ముగ్గులు వేయడం అభినందనీయమన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని సూచించారు. మొదటి బహుమతి డి.లక్ష్మి, ద్వితీయ బహుమతి భాగ్య శ్రీ, తృతీయ బహుమతిని అందించారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహకంగా భగవద్గీత పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో హిందు ఉత్సవ సమితి అధ్యక్షులు పెండ పు కాశీనాథ్, ప్రముఖ వైద్యులు డాక్టర్ దామోదర్ రెడ్డి, ప్రముఖ పూజారి బబ్రు మహారాజ్, బీఆర్ఎస్ నాయకులు విలాస్ గాదేవార్, ఆర్ఎస్ఎస్ బాధ్యులు సరికొండ దామోదర్, కృష్ణదాస్, డాక్టర్ నగేష్, వెంకట్ రెడ్డి, పురస్తు గోపాల్, నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

# పల్సి(బి)లో అఖండ హరినామ యజ్ఞోత్సవం

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని పల్సి(బి) తండలోని సంత్ శ్రీ నారాయణ బాబా ఆశ్రమంలో సోమవారం 29వ వార్షికోత్సవం సందర్భంగా అఖండ హరినామ మహా యజ్ఞోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ వేర్వేరుగా హజరయ్యారు. ముందుగా ముఖ్యఅతిధులకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు తమ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ రోజు పుష్య పున్నమి చాలా శుభదినమని, ప్రతీ ఏటా నారాయణ బాబా ఆశ్రమానికి వివిధ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున వస్తారని గుర్తు చేశారు. నారాయణ బాబా గతంలో వామన్‌నగర్‌లో ఉండేవారని, 2004వ సంవత్సరంలో బాబాను మొదటిసారి కలిశామని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ బాబా ఆలయ కమిటీ అధ్యక్షులు జాదవ్ కిసాన్, మండల కన్వీనర్ తోట వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు కేదారేశ్వర్‌రెడ్డి, గంగాధర్, నిమ్మల సుదర్శన్‌రెడ్డి, పిడుగు అభిరామ్‌రెడ్డి, వామన్, రామ్ కిషన్, శ్రీనివాస్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, పెందూర్ మాధవరావు, చంటి, గ్రామస్తులు అవినాష్, మనిరామ్, దత్తురాం, కాంగ్రెస్ నాయకులు కళ్యాణం రాజేశ్వర్, ప్రతాప్, రమేష్‌రెడ్డి, రాకేష్, ప్రవీణ్ రెడ్డి, దేవిదాస్, వెంకటేష్, గంగారాం, గణేష్ పటేల్, సల్ల దేవన్న, జయరాం పాల్గొన్నారు.

## హత్య కేసులో ఇద్దరు అరెస్టు

నవతెలంగాణ-ముధోల్

హత్య కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ముధోల్ సీఐ మల్లేష్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. ముధోల్‌లోని కోలిగల్లీకి చెందిన కరుణ్(32) శనివారం హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తులో భాగంగా మృతుడి తండ్రి ఏఎస్సై రాందాస్, మృతుడి బావ కానిస్టేబుల్ ఆయిన అనిల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోని విచారించారు. అయితే ముధోల్ పోలీస్ స్టేషన్‌లో హత్య కేసు నమోదైంది. ఈ కేసులో భాగంగా నిందితులు ఇద్దరిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్టు సీఐ పేర్కొన్నారు. విచారణ అనంతరం మీడియాకు పూర్తి వివరాలు వెల్లడిస్తామని సీఐ చెప్పారు.

## జింకను కాపాడిన కాలనీవాసులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఓ వన్య ప్రాణిని కాలనీవాసులు కాపాడి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని పిట్టలవాడకు ఓ కృష్ణజింక వచ్చింది. అక్కడ ఉన్న వీధి శునకలు జింకను తరుముతూ దాడిచేసి గాయపర్చాయి. కుక్కల బారిన పడి తీవ్ర గాయాలపాలైన కృష్ణజింకను పిట్టలవాడ కాలనీవాసులు కాపాడి మావల పోలీసులకు అప్పగించారు. పోలీసులు అటవీ రేంజ్ అధికారి గులాబ్ సింగ్‌కు సమాచారం ఇవ్వగా బీట్ అధికారి ఆ కృష్ణజింకకు పశు వైద్యాధికారులతో చికిత్స చేయించారు. అనంతరం సోమవారం ఉదయం స్థానిక హరితవనంలో వదిలేశారు.

## యంగ్ ఇండియాకే బోల్ పోటీల్లో యువత భాగస్వాములు కావాలి



నవతెలంగాణ-ఉట్నూర్

దేశవ్యాప్తంగా యువతను మేలుకొల్పి, పేదల పక్షాన ప్రశ్నించే గొంతుకలనూ తయారు చేయడమే యంగ్ ఇండియా కే బోల్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి యంగ్ ఇండియా కే బోల్ సీజన్-5కి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న యువతను పేద ప్రజల పక్షాన పోరాటంలో భాగస్వామ్యం చేయడంలో భాగంగా యంగ్ ఇండియా కే సీజన్- 5ను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. సమస్యల పరిష్కారంలో యువత ముందు వరుసలో ఉండాలనే మంచి ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందన్నారు. యంగ్ ఇండియా కే బోల్ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలనుకునే యువతీ, యువకులు గూగుల్‌లో లింక్ అందుబాటులో ఉందని, అందులో వివరాలను పొందుపరిచే భాగస్వాములు కావచ్చన్నారు. గెలుపొందిన వారికి నగదు బహుమతుల ప్రధానం ఉంటుందని తెలిపారు. ఇందులో గెలిచిన వారికీ ఏఐసీసీ జాతీయ అధికార ప్రతినిధిగా నియమించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సమరసింహారెడ్డి, ఖానాపూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అరికిళ్ల పరమేశ్వర్, నిర్మల్ నియోజకవర్గ అధ్యక్షుడు హర్షద్, ఉట్నూర్ మండల అధ్యక్షుడు తిగుట్ల రాజ్ కుమార్, ఇంద్రవెల్లి మండలాధ్యక్షుడు ఇమ్రాన్, జన్నారం మండలాధ్యక్షుడు గణేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు భాస్కర్, మహేష్ పాల్గొన్నారు.

## వైభవంగా గోదాదేవి కళ్యాణం



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ధనుర్మాస ఉత్సవాలు పురస్కరించుకొని వాల్మీకి నగర్ రామాలయంలో సోమవారం శ్రీ గోదాదేవి కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో శ్రీ గోదాదేవి రంగనాథుల ఉత్సవమూర్తులను మేళ తాళాలతో తీసుకువచ్చి కళ్యాణోత్సవాన్ని జరిపారు. పట్టణంలోని భక్తులు హాజరై కళ్యాణాన్ని తిలకించి తరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ వారు తగు ఏర్పాట్లు ఏర్పాట్లు చేశారు. అదే విధంగా జిల్లా కేంద్రంలోని మల్లన్న గుట్ట హరిహర క్షేత్రం అయ్యప్ప ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీ గోదాదేవి కళ్యాణం సోమవారం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోద మురళీధర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కళ్యాణానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ గురుస్వామి నవయుగ మూర్తి, కోశాధికారి వేణుగోపాల్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## కంది శ్రీనివాస్‌రెడ్డి ఇంట బోగి సందడి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి ఇంట సంక్రాంతి సందడి మొదలైంది. బోగి పండుగని పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యులు, పిల్లాపాపలతో ఆనందంగా గడిపారు.కంది శ్రీనివాసరెడ్డి తన సతీమణి కంది మౌనా శ్రీనివాసరెడ్డితో కలిసి తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకున్నారు. తమ పిల్లలకు బోగి పళ్ళ పోసి ఆశీర్వదించారు. భోగ భాగ్యాలు, సిరి సంపదలతో వర్ధిల్లాలని దీవించారు.

